# బుడతకీచు

కాల ప్రవాహం అతి వేగంగా ప్రవహిస్తూ వుంది. అందులో భూత వర్తమాన భవిష్యత్ కాలా లున్నయి. వాటిని చూచినవాళ్ళు ఎవ్వరూ లేరు. వున్నాయని మాత్రం అందరి నమ్మకం.

ఒక సమయంలో దూర్వాసోముని ఆకాశంతో ప్రయాణంచేస్తూ, భూలోకంలోవున్న ఈ కాలప్రవాహాన్ని చూచి ఆశ్చర్య పడ్డాడు. ఇటువంటి ప్రవాహం ఆయన ఇంతకుముందు ఎన్నడూ, ఎక్కడా చూచి వుండలేదు. స్వర్గంలో కాలప్రవాహం లేదు. మందాకిని వుంది. నరకంలో వుంది వైతరణి. మందాకిని ఉలకదు; పలకదు. వైతరణి కదలదు; మెదలదు.

ఈ విధంగా దూర్వాసోముని ఆశ్చర్య పడినవాడై, త్రిలోక సంచారియగు నారద మౌనిని పిలిచి అడిగాడు.

"ఏమిటది?"

"ప్రవాహం?" అని చెప్పాడు నారదమౌని.

"అదేం ప్రవాహం?" అడిగాడు దూర్వాసోముని.

"కాలప్రవాహం" అన్నాడు నారదమౌని.

"అంటే?" అడిగాడు దూర్వాసోముని.

"ప్రవాహం అనేటువంటి కాలం" అన్నాడు నారదమౌని.

దూర్వాసోమునికి కోపం వచ్చింది. తన్నుతాను మరచిపోయే కోపం వొచ్చినప్పుడే సత్యం మాట్లాడేది దూర్వాసోముని.

"కాలం అనేటటువంటి ప్రవాహం కాదూ?" అని అడిగాడు దూర్వాసోముని.

"అవునవును," అన్నాడు నారదమౌని. నారదమౌనికి నవ్వొచ్చింది.

దూర్వాసోముని ముక్కుకు సూటిగా మాట్లాడటంవల్ల లాభంలేదని తెలుసుకున్నవాడై "సరే" అన్నాడు.

నారదమౌనికి, దూర్వాసోమునిని చూస్తే జాలివేసింది. నవ్వువొస్తే గాని, నారదమౌనికి సత్యంరాదు. అందుకని నవ్వు తెచ్చుకొని దాని మహాత్యం ఇలా చెప్పాడు— "కాలప్రవాహంలో స్నానంచేస్తే చిరంజీవత్వం సిద్ధిస్తుంది"దూర్వాసోమునికి ఆశ పుట్టింది. ఆయనకు చిరంజీవత్వం వుందని మనం అనుకుంటాం గాని నిజంగాలేదు.అందుకనే ఆయనకు కోపం ఎక్కువ.

నారదమౌని మాటలు చెవినిపడ్డవో లేదో, దూర్వాసోముని బర్రున భూలోకానికి దిగాడు.

నారదమౌని వెనకనుంచి బిగ్గరగా అరిచి చెప్పాడు:

"ముందు భూతకాలంలో, తర్వాత వర్తమానకాలంలో ఆ తర్వాత భవిష్యత్ కాలంలో స్నానంచేస్తేనే చిరంజీవత్వం సిద్ధించేది! వరసక్రమం తప్పకూడదు"

"అదెంతపని!" అనుకున్నాడు దూర్వాసోముని.

* * * *

దూర్వాసోముని సరాసరి కాలప్రవాహం ఒడ్డున దిగాడు.నారదమౌని మాటలు ఇంకా చెవుల్లో గింగిరు మంటున్నై. ముందు భూతకాలంలో స్నానం చెయ్యాలి. తర్వాత వర్తమానంలో-అటు తర్వాత భవిష్యత్తులో-అప్పుడుగాని చిరంజీవత్వం సిద్ధించదు. నారదమౌని చెప్పినప్పుడు, తేలిగ్గా బుడుకుబుడుకున మునిగి మొక్కు తీర్చుకుందాం అనుకున్నాడుగాని, తీరా కాలప్రవాహం దగ్గరకు వొచ్చేటప్పటికి చిక్కుపడ్డాడు. అంతా ఒకటే

ప్రవాహం. అతివేగంగా ప్రవహిస్తుంది. ఇది వర్తమానం అనుకుంటూ వుండగానే భూతకాలం కిందకు మారుతూ వుంది. ఇది భవిష్యత్ అని తేల్చుకోకముందే భవిష్యత్ వర్తమానం అవుతూవుంది.

ఇక భూత వర్తమాన భవిష్యత్ కాలాలకు యెలా తెలుసుకోవటం? వరసక్రమంగా ఎలా స్నానం చెయ్యటం? దూర్వాసోముని ఏమీ తోచనివాడై, కాలప్రవాహాన్నే అడిగి తెలుసుకుందాం అనుకున్నాడు.

"ఓ కాలప్రవాహమా?" అని పిలిచాడు.

"హో!" అని హోరుపెట్టింది కాలప్రవాహం. అది ఓంకార నాదం అనుకున్నాడు దూర్వాసోముని. ఒక్కక్షణం కంగారు పడ్డాడు. కాని దూర్వాసోముని దురాశాపరుడు తన కోర్కెను జయించలేకపోయాడు.

"ఓ కాలప్రవాహమా?" అన్నాడు దూర్వాసోముని.

"హో!" అన్నది కాలప్రవాహం.

"నేను దూర్వాసోమునిని" అన్నాడు దూర్వాసోముని.

"చిత్తం" అన్నది కాలప్రవాహం.

"నేను భూత వర్తమాన భవిష్యత్ కాలాల్లో స్నానం చెయ్యదలిచాను" అన్నాడు దూర్వాసోముని.

"చిత్తం" అన్నది కాలప్రవాహం.

"నీలో భూతవర్తమాన భవిష్యత్ కాలాలు దాగున్నాయని నారద మౌని చెప్పగా విన్నాను. ఎక్కడెక్కడవున్నవో చెప్పు. వాటిలో వరస క్రమం తప్పకుండా నేను స్నానం చెయ్యాలి" అన్నాడు దూర్వాసోముని.

"ఆదిలో భూతకాలం, మధ్య వర్తమానం. అంతంలో భవిష్యత్" అన్నది కాలప్రవాహం. ఈవిధంగా దూర్వాసోమునికి చెప్పినదై, తన పని మీద తానువుంది కాలప్రవాహం.

దూర్వాసోముని సంతోషించాడు. తన పని యింత తేలిగ్గా అవు తుందనుకోలేదు.ఎంత తపస్సు ధారపొయ్యవలసి వొస్తుందో అనుకున్నాడు. వెంటనే కాల్రపవాహం మొదలు కనుక్కోటానికి బయల్దేరాడు. భగీరథ ప్రయత్నానికి పూనుకున్నాడు.

కాల్రపవాహం వొడ్డునపడి నడిచాడు- నడిచాడు - యుగయుగాలుగా నడిచాడు. ఎంత నడిచినా కాల్రపవాహం మొదలు కనిపించలేదు. కాల ప్రవాహం ఆది మధ్యాంత రహిత మేమో కొంపతీసి! దూర్వాసోమునికి కోపం వొచ్చింది.

"ఓ కాల్రపవాహమా!" అన్నాడు కోపంగా.

"హో" అన్నది కాల్రపవాహం.

"ఎక్కడ భూతకాలం?" అడిగాడు దూర్వాసోముని.

"ఇక్కడే" అన్నది కాల్రపవాహం.

ఆ ధ్వని ఎక్కడనుంచి వచ్చిందీ తెలియలేదు దూర్వాసోమునికి దిక్కులు పరికించాడు.

"ఇక్కడే" అన్నది కాల్రపవాహం. మళ్ళీ ఆ ధ్వని ఎక్కడ నుంచి వచ్చిందీ తెలియలేదు దూర్వాసోమునికి. అసలే కోపదారేమో, ఆయనకు ఒళ్ళు మండిపోయింది.కమండలం చేత్తోపాటు పైకెత్తినవాడయి... "నేను దూర్వాసోముని నయితే, నేనే చిరంజీవత్వంకోసం ప్రయత్నిస్తున్న వాడనయితే నేనే ఫలానావారి పుత్రుడనయితే...." అని శాపం మొదలు పెట్టాడు.

దూర్వాసోముని తపశ్శక్తి కాల్రపవాహానికి తెలుసు. పైగా అగస్త్యులవారు సముద్రాన్ని పుడిసిల్తో పుక్కిలిస్తూ వుంటే కళ్ళారా చూచి వుందికూడా! భయంతో గడ గడ వొణికిపోయింది.

"దూర్వాసోమునీ...." అని ప్రార్థించింది.

"చెప్పు" అన్నాడు ఆయన.

"చెప్తున్నాను" అన్నది కాలప్రవాహం.

"ఇక ఒక్కక్షణం ఆగటానికి వీలులేదు" అన్నాడు ఆయన.

"మీ ఎడమ చేతివైపు భూతకాలం! ఎదురుగా వర్తమానం! కుడి చేతివైపు భవిష్యత్తు" అన్నది ఆమె.

దూర్వాసోముని సంతోషించినవాడై ఎడమచేతివైపు ముందుస్నానం చెయ్యటానికి నిశ్చయించుకున్నాడు. నడిచాడు-నడిచాడు-యుగ యుగాలు నడిచాడు, ఎంత నడిచినా కాలప్రవాహానికి ఎడమచేతివైపు అనేదిఎక్కడి కక్కడికి వుంటూనేవుంది. దూర్వాసోమునికి ఉక్రోషం వచ్చింది. కాల ప్రవాహం తన్ను మోసంచేస్తూవుంది అని తలచినవాడయి, ఈసారి కాలాన్నే అడిగి తేల్చుకుందాం అనుకున్నాడు.

"ఓ భూతకాలమా?" పిలిచాడు దూర్వాసోముని.

భూతకాలం "ఆఁ" అని పలికింది.

"ఎక్కడ?" అడిగాడు ఆయన.

"ఇక్కడ" చెప్పింది భూతకాలం.

దూర్వాసోముని సంబరపడి అక్కడ స్నానం చెయ్యటానికి సిద్ధపడ్డాడు.

"ఆగు" అన్నది వర్తమానం.

"ఎవరు నువ్వు" అడిగాడు ఆయన.

"వర్తమానాన్ని" చెప్పింది వర్తమానం.

"ఎక్కడున్నావు?" అడిగాడు ఆయన.

"భూతకాలంలో" చెప్పింది వర్తమానం.

దుర్వాసోముని తికమక పడినవాడయి గుక్కతిప్పుకోలేక "భవిష్యత్తు ఎక్కడ?" అని అడిగాడు.

"నాలో" చెప్పింది వర్తమానం.

దుర్వాసోమునికి ఆశాభంగం కలగటంవల్ల, కోపం తీక్షణమయింది. ఇదంతా కాల ప్రవాహం ఆడుతున్న ఆటే అనుకున్నాడు. దానికి ఎంత నిర్లక్ష్యం! దానికి తన ప్రభావం తెలియజెయ్యాలి రోగం కుదర్చాలి.

"ఒహో, కాలప్రవాహమా!" అన్నాడు.

కాలప్రవాహం గజగజ వొణికింది. పలకటానికే భయపడింది. శివుడు విషం మింగి గరళకంఠుడవటం కాలప్రవాహం కళ్ళారా చూసింది.

"నీవు భూత వర్తమాన భవిష్యత్తు అనే మూడు ముక్కల క్రింద తెగిపోదువుగాక" అని శపించాడు దుర్వాసోముని.

కాలప్రవాహం తుకతుక ఉడికింది గుబగుబ పొంగింది. దడదడలాడింది. బరబర మూడు ముక్కలు కింద విడిపోయింది. దుర్వాసోముని తన తపశ్శక్తికి తానే అచ్చెరువు పొందాడు. వికసించిన ముఖపద్మం గలవాడై, వరసక్రమంగా భూత వర్తమాన భవిష్యత్ కాలాల్లో స్నానం చెయ్యటానికి సిద్ధపడ్డాడు.

కాని ఆశ్చర్యం! ఆ మూడు ముక్కలూ ఇప్పుడు ప్రవాహాల్లాలేవు. కరుడుకట్టుకుపోయినై. భయంకరమైన చీకట్లను విరజిమ్ముతునై! కాల ప్రవాహం చీకటిమయంగా మారింది. ఆ చీకటిలో భూత వర్తమాన భవిష్యత్ కాలాలు యెక్కడున్నవో దుర్వాసోమునికి తెలియలేదు. ఎలా వరసక్రమం తప్పకుండా స్నానం చెయ్యటం? ఎలా చిరంజీవత్వాన్ని పొందటం? దుర్వాసోమునికి వళ్ళు తెలియని కోపం వచ్చింది. కమండలంతో చీకటిని ఛేదించి శపించాడు.

"భూతకాలమా. నీవు చెట్టు బెరడువు అవుదువుగాక"

భూతకాలం చెట్టుబెరడై గట్టుమీదకు ఎగిరి దూకి నుంచుంది

"వర్తమానమా, నువు చెట్టుతొఱ్ఱవు అవుదువుగాక" అన్నాడు ఆయన.

వర్తమానం చెట్టుతొఱ్ఱ అయి గట్టుమీదకు వొచ్చికూర్చుంది.

"భవిష్యత్తూ, నీవు చెట్టువిత్తువు అవుదువు గాక!" అన్నాడు దుర్వాసోముని. భవిష్యత్తు విత్తు అయి గట్టుమీదకు దొర్లి పడున్నది.

"ఇక ఇప్పుడేం చేస్తుంది కాలప్రవాహం? దుర్వాసోమునిని స్నానం చేయకుండా ఆపగలదా!" అని సగర్వంగా అనుకొని, స్నానానికి సిద్ధపడ్డాడు దుర్వాసోముని.

అహో! ఏమి చెప్పను! అక్కడ కాలంలేదు గదా, ప్రవాహం కూడా లేదు.

కాలప్రవాహం అదృశ్యం అవటంవల్ల ముల్లోకాలూ తల్లడిల్లినై. దేవతలకు ముచ్చెమటలు పోసినై. దానవులకు నాభిదగ్గరవున్న అమృత కలశాలు కదలినై. మానవులకు కోరలు మొలిచినై. అంతా అదరా బాదరా దుర్వాసోమునిని చుట్టుముట్టారు. "మౌని చంద్రమా! కాలప్రవాహం ఆగటంవల్లముల్లోకాలూ తల్లడిల్లుతున్నై. వర్ణించటానికి వీల్లేని వైపరీత్యాలు జరుగుతున్నై. తమరు శాపం ఉపసంహరించుకోండి" అని ప్రార్థించిన వారయ్యారు.

దూర్వాసోముని బిక్కమొహం వేసుకొని నుంచున్నాడు. తనశాపం ఇలా పరిణమిస్తుందని ఆయన అనుకోలేదు. కాలప్రవాహం ఆగిపోవటం వల్ల దృష్టి మందగించింది. శరీరం భగభగ మండిపోతూంది. మాట్లాడానికే ప్రబల ప్రయత్నం చెయ్యవలసి వొచ్చింది. "నేనేం చెయ్యను? నాకు శాపం ఇచ్చే శక్తిగాని, ఉపసంహరించుకునే శక్తిలేదు" అన్నాడు.

ఈ మాటకు దేవతలకు - దానవులకు, మానవులకు-మౌనులకు అందరికీ కోపం వొచ్చింది.

"పోనీ శాపవిమోచనానికి మార్గం చూపు స్వామీ" అన్నాడు నారద మౌని.

దూర్వాసోముని ఉచ్ఛ్వాసనిశ్వాసాలు బిగబట్టినవాడై ఇలా అన్నాడు. "ఎవరైతే భూతకాలం అనే బెరడుతో పళ్ళుతోముకొని, వర్తమానం అనే బోదెతో మొహం కడుక్కొని భవిష్యత్తు అనే విత్తుని భోజనం చేస్తారో వారివల్ల నా శాపవిమోచనం అవుతుంది."

దేవతలు ప్రయత్నించారు. దానవులు ప్రయత్నించారు. మానవులు ప్రయత్నించారు. మౌనులు ప్రయత్నించారు. కాని, ఎవ్వరివల్లా ఈ పని కాలేదు. భూతకాలం అనే బెరడుగానీ, భవిష్యత్తు అనే విత్తుగానీ వాళ్ళకు అందలేదు. దొరికినట్టే దొరికి దూరంగా వెళ్ళి నిలబడేవి.

"మౌనిచంద్రమా, మావల్ల కాలేదు" అని ప్రాధేయపడ్డారు అంతా.

నారదమునిమాత్రం చిరునవ్వు నవ్వుతూ నుంచున్నాడు.

"మీవల్లకాదు. కలియుగంలో ఒక మహాపురుషుడు జన్మిస్తాడు. అతనే నా శాపవిమోచనం చెయ్యటానికి సమర్థుడు" అన్నాడు దూర్వాసో ముని.

"కలియుగంలోనా?" అన్నాడు విశ్వామిత్రుడు.

"అవును" అన్నాడు నారదముని చిరునవ్వు నవ్వుతూ,

"వశిష్టమహర్షీ?" పిలిచాడు విశ్వామిత్రుడు.

"ఏం, విశ్వామిత్ర రాజర్షీ?" పలికాడు వశిష్టబ్రహ్మర్షి.

"కలియుగంలో ధర్మం ఎన్ని కాళ్ళమీద నడుస్తుంది?" అడిగాడు విశ్వామిత్ర రాజర్షి.

"ఒంటికాలి మీద" అన్నాడు వశిష్టబ్రహ్మర్షి.

"మనవల్ల కానిపని వాళ్ళెలా చేస్తారు?" అడిగాడు విశ్వామిత్ర రాజర్షి.

"నేను నమ్మను?" అన్నాడు వశిష్ట బ్రహ్మర్షి.

"నమ్మక చేసేదేమిటి?" అడిగాడు నారదముని చిరునవ్వు నవ్వు తూ అంతా ఆలోచించారు_"నిజమే" అన్నారు.

"అయితే కలియుగం వొచ్చేవరకూమనం అంతా ఎలా బ్రతకటం?" అన్నాడు వశిష్ఠబ్రహ్మర్షి.

"మనం చిరంజీవులం బ్రహ్మర్షి!" అన్నాడు విశ్వామిత్ర రాజర్షి.

"అయితే మాత్రం?" అన్నాడు వశిష్టబ్రహ్మర్షి.

"పొగన్నా తాగొద్దూ" అన్నారు మౌనులు.

"సత్యం సత్యం" అన్నాడు నారదముని చిరునవ్వు నవ్వుతూ.

"కలియుగం వొచ్చేవరకూ, కాలప్రవాహం కదిలేవరకూ, మేము ఆకూ అలంగా వుంటాం" అన్నారు దేవతలు.

"కొండా గుట్టలుగా వుంటాం" అన్నారు దానవులు.
"కాయ గసరులుగా వుంటాం" అన్నారు మానవులు.

"తథాస్తు" అన్నాడు నారదముని చిరునవ్వుతూ.

అకస్మాత్తుగా దేవతలూ, దానవులూ, మానవులూ, మునులూ అంతా అంతర్థానం అయ్యారు. భారతదేశం కీకారణ్యం అయింది.

* * * * *

కలియుగం వొచ్చింది. దుర్వాసోముని చెప్పినట్లు ఒక మహాపురుషుడు పుట్టాడు. పుట్టీపుట్టటంతో కీకారణ్యంగావున్న భారతదేశం తిరగటం మొదలుపెట్టాడు.

అతన్ని చూచి భూత వర్తమాన భవిష్యత్ కాలాలు ఆనందంతో ఉప్పొంగి పోయినై. గంతులు వేస్తూ, "అడుగో మహాపురుషుడు" అన్నది భూతకాలం అనే ఔరదు.

ఉబ్బిపోతూ, "ఆహా!" అన్నది వర్తమానం అనే బోదె.

దొర్లుతూ "వొచ్చాడు నాస్వామి" అన్నది భవిష్యత్తు అనే విత్తు.

ఆ మహాపురుషుడు ఇదంతా గమనించలేదు. ఒక ఆవులింత ఆవులించి సరిగ్గా లెక్కపెట్టినట్టు మూడు చిటికెలు వేశాడు. మూడుచిటికెలూ, ఇంతంతై, బ్రహ్మాంతై మూడుకాలాల్నీ నిలవేసినై. మొదటి చిటికెభూతకాలాన్ని, రెండోచిటికెవర్తమానాన్ని, మూడో చిటికె భవిష్యత్తుని. అతను నెమ్మదిగా కదిలాడు. భూతకాలం అనే బెరడుతో పళ్ళు తోముకున్నాడు. వెంటనే భూతకాలం వర్తమానంతో కలిసింది. వర్తమానం అనే బోదెతో మొహం కడుక్కున్నాడు. వెంటనే వర్తమానం భవిష్యత్తులో కలిసింది. భవిష్యత్తు అనే విత్తును తీరిగ్గా కూచోని భోజనం చేశాడు.

వెంటనే కాలప్రవాహం వాయువేగ మనోవేగాలతో ప్రవహించటం మొదలుపెట్టింది. భారతదేశం అనే కీకారణ్యానికి చలనం కలిగింది. ఆకూ అలం దేవతలైనై. కొండాగుట్టలు దానవులైనై. కాయగసరులు మానవులైనై. దుంపకూరలు మునులైనై. అయ్యీ అవటంతోనే దేవతలు దానవులు మానవులు మునులు అంతా మహా పురుషుణ్ణి చూట్టానికి పోగయ్యారు. చూచి ఆశాభంగం చెందినవారై, ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నవారయ్యారు.

"ఎవరు ఇది?" అడిగాడు విశ్వామిత్ర రాజర్షి.

"ఎవరిది?" అన్నాడు వశిష్టబ్రహర్షి.

"ఎవరు ఇది?" "ఎవరిది?" "ఎవరు ఇది?" "ఎవరిది?" అన్నారు అంతా.

అతనికి దేవతలకుమల్లే రెక్కలున్నై. దానవులకుమల్లే కోరలున్నై. మానవులకుమల్లే చూపులున్నై. మునులకుమల్లే గడ్డంవుంది. ఎవరికి వారికి అతన్ని ఎక్కడో చూచినట్టువుంది. కాని అతన్నెవరూ చూడకపోవడం యదార్థం. ఎవరికివాళ్ళు తమ లక్షణం చూచుకొని ఎక్కడో చూశాం అను

కున్నాగే గాని, అందరి లక్షణాలు కలిసివున్న వ్యక్తిని యిదే వారు మొదటిసారి చూట్టం.

"ఎవరు ఇది?" అడిగాడు విశ్వామిత్రరాజర్షి.

"ఎవరిది?" అన్నాడు వశిష్ఠబ్రహ్మర్షి.

"పశుబలం" అన్నారు దేవతలు.

"ఇంద్రజాలం" అన్నారు దానవులు.

"వర్గకలహం" అన్నారు మానవులు.

"రంభయో, తిలోత్తమయో, ఊర్వశియో" అన్నారు మునులు.

అంటం అయితే అన్నారేగాని, నిజం చెప్పాలంటే అతనెవ్వరో ఎవ్వరికీ తెలియదు. ఇంతలో విశ్వమంతా ఒక్కసారి ఓంకారనాదము చేసింది. ఆ నాదబ్రహ్మంలోనుంచి వేదాలూ ఉపనిషత్తులూ పైకొచ్చి భూమి మీదకు దిగినై. దేవతలూ, దానవులూ, మానవులూ, మునులూ—అందరు సగౌరవంగా నమస్కరించి, దూరంగా నిలబడ్డారు.

విశ్వామిత్రరాజర్షి ఒక అడుగు ముందుకు వేసినవాడై "ఎవరు ఇది?" అని అడిగాడు మహాపురుషుణ్ణి చూపి.

వేదాలు అపౌరుషేయాలు అవటంవల్ల, మాట్లాడకుండా మునగదీసుకు కూర్చున్నాయి. ఉపనిషత్తులు దివ్యదృష్టితో ఆ మహాపురుషుణ్ణి పరిశీలించి చూస్తున్నాయి. ఉపనిషత్తులకు తెలియం దేముంటుంది గనుక! అంతా వాటి నాగామృతం గ్రోలాలని నిరీక్షిస్తున్నారు.

పరీక్ష పూర్తి అయింది.

ఉపనిషత్తులు కంఠంపైకెత్తి, తమ దివ్యదృష్టితో దేవతలను, దానవులను మానవులను మునులను పరిశీలిస్తూ అడిగాయి—"ఎవరిది?"

అంతా ఆశ్చర్యపడ్డారు. భయపడ్డారు. ఉపనిషత్తులకే తెలియలేదు!

వేదాల నడిగి ప్రయోజనంలేదు. అవి అపౌరుషేయాలు అవటంవల్ల మాట్లాడవు. ఇక ఒకరే మిగిలారు. త్రిలోకసంచారియైన నారదముని. విశ్వామిత్ర రాజర్షి వశిష్ఠ బ్రహ్మర్షి తమలో తాము గుసగుస లాడుకొన్నవారై ఆయన్ని పట్టుకొనివచ్చి మధ్య నిలబెట్టిన వారయ్యారు. "ఎవరు ఇది?" అడిగాడు విశ్వామిత్రరాజర్షి.

"ఎవరు ఇది?" అన్నాడు వశిష్ఠబ్రహ్మర్షి.

"బుడతకీచు" అని చెప్పాడు నారదముని చిరునవ్వు నవ్వుతూ.

ఈ మాటలకు అంతా నిర్ఘాంతపడ్డారు.

"బుడతకీచా!" అన్నాడు విశ్వామిత్రరాజర్షి గుక్కలుపట్టి నవ్వుతూ.

"మడత పేచీ!" అన్నాడు వశిష్ఠబ్రహ్మర్షి పక్కలు విరగ ఏడుస్తూ.

"ఎవరు నువ్వు?" బుడతకీచుని అడిగారు దేవతలు.

ఈ ప్రశ్నకు అతని రెక్కలు వూడినై.

"ఎవరు నువ్వు?" అడిగారు దానవులు.

ఈ ప్రశ్నకు అతని చూపులు మారినై.

"ఎవరు నువ్వు?" అడిగారు మునులు.

ఈ ప్రశ్నకు అతని గడ్డం కరిగింది.

ఇదంతా చూస్తూంటే కాలప్రవాహానికి భయం వేసింది. ఈ దేవతలూ దానవులూ మానవులూ మునులూ అంతా కలిసి తన బుడతకీచుని ఏం చేస్తారో అని ఈ భయంతో వొణుకుతున్న తన చేతులను జాపినదై నెమ్మదిగా తన అంకం లోకి తీసుకుంది బుడతకీచుని. బుడతకీచు కాల ప్రవాహంలో తేలిపోయాడు. కాలప్రవాహం వాయువేగ మనోవేగాలతో, ప్రవహిస్తూ వుంది. దేవతలూ, దానవులూ, మానవులూ, మునులూ దిగబడి పోయారు. ఏ ఒక్కరూ కాలప్రవాహంలో కలవలేరు. అందుకనే భారత దేశంలో దేవతలు దేవతలుగానే వుండిపోయారు. దానవులు దానవులుగానే వుండిపోయారు, మానవులు మానవులుగానే వుండిపోయారు. మునులు మునులుగానే వుండిపోయారు. దూర్వాసోముని కాలప్రవాహాన్ని ఆపినదానికి ప్రతిఫలం అనుభవిస్తున్నాం!

)o............o(